క్లుప్తంగా

సమస్యలు పట్టవా?

గద్వాల అర్బన్: ప్రజాసమస్యల పరిష్కారంపై ప్రభుత్వం పట్టనట్లు వ్యవహరించడం తగదని నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ రంజిత్‌కుమార్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని హమాలీ కాలనీలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హమాలీ కాలనీలో తాగునీరు, రోడ్డు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదన్నారు. రాబోయే రోజుల్లో బహుజన నాయకత్వం కోసం కలిసికట్టుగా ముందుకెళ్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బుచ్చిబాబు, లవన్న, విష్ణు, బలరాం, తిమ్మప్ప, రంగస్వామి, రాముడు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీని కలిసిన నాయకులు



అలంపూర్: నియోజకవర్గంలోని పలు మండలాల నాయకులు ఆదివారం కర్నూల్‌లో ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డిని కలిశారు. హైదరాబాద్ నుంచి కర్నూల్‌కు వచ్చిన ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఇక్కడి పరిస్థితులపై స్థానిక నాయకులతో ఎమ్మెల్సీ చర్చించినట్లు తెలిపారు.

కుచినెర్లలో వైద్యపరీక్షలు



కేటీదొడ్డి: మండలంలోని కుచినెర్లలో ఆదివారం కామన్ సర్వీస్ సెంటర్ ఆధ్వర్యంలో లేబర్‌కార్డు కలిగిన వారికి వైద్యపరీక్షలు నిర్వహించారు. డాక్టర్ ఫరూఖ్ రక్త, మూత్ర, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను అందజేశారు. సీఎస్‌సీ ఆధ్వర్యంలో లేబర్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వైస్‌ఎంపీపీ రామకృష్ణనాయుడు, సర్పంచ్ హైమవతి, ఉపసర్పంచ్ నర్సప్ప, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

బాలుడిపై పందుల దాడి

అయిజ: ఇంటి వద్ద ఆడుకుంటున్న బాలుడిపై పందులు దాడిచేసి గాయపర్చిన ఘటన పట్టణంలోని నాల్గోవార్డులో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. ఎస్సీ కాలనీకి చెందిన ఎర్రన్న కుమారుడు బన్ని మధ్యాహ్నం భోజనం చేసి ప్లేటు కడగడానికి ఇంటి బయటికి వచ్చాడు. ఈ క్రమంలో అమాంతం పందుల గుంపు బాలుడిపై దాడి చేశాయి. చుట్టుపక్కల వారు రాళ్లతో పందులను తరమడంతో బాలుడు ప్రాణాలతో బయటపడ్డాడు. పందుల దాడిలో తీవ్రగాయాలైన బాలుడిని చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు. పందుల యజమానులపై చర్యలు తీసుకొని తమకు న్యాయాలని బాలుడి కుటుంబసభ్యులు కోరారు.

ఆలయంలో చోరీ

పెబ్బేరు రూరల్: శ్రీరామాలయంలో శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసిన ఘటన మండల పరిధిలోని పాత సూగూర్‌లో చోటుచేసుకుంది. గ్రామస్తులు, పోలీసుల కథనం ప్రకారం.. గ్రామంలోని శ్రీరామాలయానికి పూజారి రోజువారీగా తాళం వేసివెళ్లాడు. శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు తాళం విరగొట్టి లోపలికి చొరబడి హుండీని బద్దలుగొట్టేందుకు ప్రయత్నించారు. అది రాకపోవడంతో సీతమ్మ విగ్రహం మెడలో తాళి బొట్టును తీసుకెళ్లారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అంధకారంలో అమరచింత బస్టాండ్



అమరచింత: మున్సిపల్ కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ మూడు నెలలుగా అంధకారంలో మగ్గుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. మూడు నెలలుగా బస్టాండ్‌లో రాత్రిపూట కరెంటు సౌకర్యం లేక విద్యుత్ బల్బులు వెలగడం లేదు. సాయంత్రం ఏడు గంటలకే బస్టాండ్ పరిసరాల్లో చిమ్మచీకటి అలుముకుంటోంది. ఇతర ప్రాంతాల నుంచి పట్టణానికి వచ్చే ప్రయాణికులు చీకటిగా ఉన్న బస్టాండ్‌లో నిలవలేక ఇబ్బందులు పడుతున్నారు. బస్టాండ్‌లో వెలుతురు లేకపోవడంతో అసంఘిక కార్యకలాపాలకు అడ్డగా మారుతోందని కాలనీ ప్రజలు ఆరోపిస్తున్నారు. వనపర్తి డిపో మేనేజర్ బస్టాండ్‌ను సందర్శించి బస్టాండ్ రూపురేఖలు మారుస్తామని ఇచ్చిన హామీ అలాగే ఉంది. ఇప్పటికైనా చర్య తీసుకొని అమరచింత బస్టాండ్‌లో విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేసి ప్రయాణికుల ఇబ్బందులు తీర్చాలని కోరుతున్నారు.

పశుగ్రాసం కొరత

- వాణిజ్య పంటల సాగుతో పశువులకు మేత కరువు
- వరిగడ్డికి పెరిగిన డిమాండ్
- పశువులను పోషించలేక ఇబ్బందులు పడుతున్న రైతులు



ట్రాక్టర్‌లో వరిగడ్డిని తరలిస్తున్న రైతులు

అయిజ: సంప్రదాయ పంటల సాగు తగ్గడం పశువులకు శాపంగా మారుతోంది. వాణిజ్య పంటల సాగు అధికం కావడంతో తీవ్రమైన పశుగ్రాసం కొరత ఏర్పడుతోంది. పశువులకు సరిపడా గ్రాసం దొరక్క రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. సాగునీటి వనరులు ఉన్న ప్రదేశాల్లో పండించిన వరిపంట ద్వారా లభించిన గడ్డి మాత్రమే పశువుల మేతకు ఆధారమైంది. అదీ కూడా సరిపడినంతగా లేకపోవడంతో కృష్ణానది పరీవాహక ప్రదేశాల్లో పండించిన వరిగడ్డిపై అలంపూర్ నియోజకవర్గ రైతులు ఆధారపడాల్సి వస్తోంది. పశువుల పోషణ కోసం అధిక డబ్బులను వెచ్చించి వరిగడ్డిని కొనుగోలు చేయాల్సి వస్తోంది. సంప్రదాయ పంటల సాగు తగ్గిపోవడంతోనే ఈ దుస్థితి నెలకొందని పశువుల పెంపకందారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తగ్గిన ఆహార ధాన్యాల సాగు..

ఏడాదికేడాది ఆహార ధాన్యాల సాగు తగ్గుతూ వస్తోంది. అలంపూర్ నియోజకవర్గంలో వరి, సజ్జలు, మొక్కజొన్న, కొర్ర, కంది పంటల సాగు ఘణనీయంగా తగ్గింది. ఇక్కడి రైతులు మిరప, పత్తి పంటలను ఎక్కువగా సాగు చేస్తున్నారు. దీంతో దీంతో మూగజీవాలకు పశుగ్రాసం కొరత ఏర్పడింది. ఆర్డీఎస్ ఆయకట్టు, నదీ పరీవాహక ప్రాంతాలు, బోరుబావుల కింద ఆహార ధాన్యాల పంటలను ఎక్కువగా సాగు చేయకపోవడంతో వరిగడ్డి ధర పెరిగింది. ఒక ఎకరంలో పండిన వరి గడ్డి ధర రూ.5వేలకు చేరింది. ఒక ట్రాక్టర్ పశుగ్రాసం కావాలంటే మూడు ఎకరాల్లో సాగు చేసిన గడ్డిని సేకరించాలి. ఇందుకోసం రూ.15వేలు, గ్రాసాన్ని గ్రామానికి తరలించేందుకు ట్రాక్టర్ కిరాయి రూ.2వేలు, కూలీల ఖర్చు రూ.2వేలు అవుతోంది. ట్రాక్టర్ గడ్డికి మొత్తం రూ.19వేలు ఖర్చవుతోంది. వ్యవసాయాధికారులు స్పందించి సంప్రదాయ పంటల సాగును ప్రోత్సహించాలని పశువుల పెంపకందారులు కోరుతున్నారు.

అలంపూర్ నియోజకవర్గంలో పశువుల సంఖ్య..

మండలం	గొర్రెలు	గేదెలు	ఆవులు, ఎద్దులు
అయిజ	65,348	8,921	6,431
ఇటిక్యాల	82,132	4,662	5,623
మానవపాడు	35,120	4,506	2,706
అలంపూర్	52,425	3,240	2,987
ఉండవెల్లి	43,322	4,286	2,732
వడ్డేపల్లి	51,289	3,998	3,826
రాజోళి	42,311	5,126	3,824

మూగజీవాలకు మేత కరువైంది..



రైతులు వాణిజ్య పంటలు సాగు చేయడంతో మూగజీవాలకు మేత కరువయ్యింది. వేరుశనగ, కంది, జొన్న పంటలు పండిస్తేనే పశువులకు మేత పుష్కలంగా లభిస్తుంది. సంప్రదాయ పంటల సాగు తగ్గిపోవడంతో పశువులకు మేత లేకుండాపోయింది. పశుగ్రాసం లభించకపోవడంతో వరిగడ్డిని ఎక్కువ ధరకు కొనాల్సిన పరిస్థితి ఏర్పడింది. – తిప్పన్న, రైతు, ఈడుగోనిపల్లి

వరిగడ్డి మాత్రమే దొరుకుతుంది..



రైతులకు వరిగడ్డి తప్ప ఇతర పశుగ్రాసం దొరకడంలేదు. గతేడాది వానాకాలంలో ఆర్డీఎస్ ఆయకట్టుతోపాటు నది పక్కల పంట పొలాల్లో వరిపంట సాగుచేశారు. దాన్ని కొనేందుకు రైతులందరూ ఎగబడటంతో వరిగడ్డి ధర అమాంతం పెరిగింది. గ్రాసం కొనలేక పశువులను అమ్ముకునే దుస్థితి ఏర్పడింది. – సత్యారెడ్డి, రైతు, అయిజ

ప్రభుత్వం ప్రోత్సహించాలి..



సంప్రదాయ పంటలు పండిస్తేనే పశువులకు మేత దొరుకుతుంది. గిట్టుబాటు ధర లభించడం లేదని రైతులు వాణిజ్య పంటలను సాగు చేస్తున్నారు. ప్రభుత్వం సంప్రదాయ పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి. అధికారులు సంప్రదాయ పంటల సాగును ప్రోత్సహించాలి. గడ్డి విత్తనాలను ఉచితంగా పంపిణీ చేయాలి. – గోవిందురెడ్డి, రైతు, జడదొడ్డి

పచ్చిగడ్డిని సాగుచేయాలి..



పశుగ్రాసానికి సంబంధించిన పంటలను సాగు చేయకపోవడంతో మండలంలో పశుగ్రాసం కొరత నెలకొంది. పశుగ్రాసం కోసం పొరుగు మండలాల్లో అధిక ధరలకు వరిగడ్డిని కొనుగోలు చేయాల్సి వస్తుంది. బోరుబావులు ఉన్న ప్రదేశాల్లో రైతులు పచ్చిగడ్డి విత్తనాలు చల్లి పశుగ్రాసాన్ని పెంచాలి. హైబ్రీడ్ వంగడాలు సాగుచేస్తే గడ్డిని కోసే కొద్దీ మళ్లీ పెరుగుతుంది. దీంతో పశుగ్రాసం కొరత తీరుతుంది. – శంకర్‌లాల్, ఏఓ, అయిజ

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం



అయిజ/మానవపాడు: రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం బీఆర్‌ఎస్‌తోనే సాధ్యమవుతోందని ఎమ్మెల్యే అబ్రహం అన్నారు. పట్టణంలోని పోలీస్‌స్టేషన్ సమీపంలో బీఆర్‌ఎస్ నాయకుడు సంకాపరం రాముడు ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయాన్ని ఆదివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం బుడగజంగాల కాలనీలో రూ.10లక్షలతో కమ్యూనిటీహాల్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. అదేవిధంగా మానవపాడు ఎస్సీ కాలనీలో సీసీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నాగేశ్వర్‌రెడ్డి, మురళీధర్‌రెడ్డి, పీఏసీఎస్ ఉపాధ్యక్షుడు అయ్యన్న, హుస్సేన్, అనంతేశ్వర్‌రెడ్డి, శివకేశవరెడ్డి, సంజీవనాయుడు, శంకర్‌నాయుడు, శంకర్‌గౌడ్, ఎంకన్న, తనగల సీతారామిరెడ్డి, అజయ్ పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి

శాంతినగర్: బీజేపీ బలోపేతానికి కృషి చేస్తామని బూత్ కమిటీ సభ్యులు, పన్నా ప్రముఖులు తెలిపారు. వడ్డేపల్లి మండలం వెంకట్రామానగర్‌లో ఆదివారం బీజేపీ మండల అధ్యక్షుడు నర్సింహులు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ ఆదేశాలను తూచ తప్పకుండా పాటిస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ధనుంజయగౌడ్, రాజగోపాల్, వెంకటేష్, రంగస్వామి, అనిల్, అంజి పాల్గొన్నారు.

మహిళా సంక్షేమంపై ప్రత్యేక దృష్టి



గట్టులో చెక్కులు అందుకున్న వారితో ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల రూరల్/గట్టు: మహిళా సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఆదివారం అంగన్‌వాడీల ఆశీర్వాద సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం కేసీఆర్ అంగన్‌వాడీలకు గౌరవ స్థానం కల్పించి స్థిరమైన వేతనాలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామంలో అంగన్‌వాడీ భవనాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రజా సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్న సీఎం కేసీఆర్‌ను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. అదేవిధంగా గట్టులో 65మంది బీసీ కులవృత్తిదారులకు రూ.లక్ష చొప్పున, 135మందికి కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ జంబు రామన్‌గౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు నాగర్‌దొడ్డి వెంకట్రాములు, ధర్మనాయుడు, గంట రమేష్, ఎంపీపీ విజయ్‌కుమార్, వైస్‌ఎంపీపీ సుమతి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు హన్మంతునాయుడు పాల్గొన్నారు.

నవంబర్‌లో బొడ్రాయి ప్రతిష్ఠ

అమరచింత: పట్టణంలో నూతన బొడ్రాయి ప్రతిష్ఠా ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించామని నిర్వహణ కమిటీ సభ్యులు విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. నవంబర్ మాసంలో 14, 15, 16 తేదీలలో బొడ్రాలను ఆయా వార్డుల్లో ప్రతిష్ఠించనున్నట్లు తెలిపారు. ఆదివారం ఉత్సవాలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ రామాలయంలో విడుదల చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మూడు రోజుల పాటు నిర్వహించే ఉత్సవాలకు సంబంధించి పట్టణ ప్రజలు, భక్తులు ఆర్థిక, వస్తు రూపాల్లో సహాయం అందించాలని కోరారు. కార్యక్రమంలో తాటికొండ రమేష్, వెంకటేశ్వర్‌రెడ్డి, పురుషోత్తంగౌడ్, మనోహర్ రాజు, నాగప్ప, వడ్ల గోపాల్, శివాజీ, నరసింహులు, డ్రైవర్ శ్రీను పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



పెబ్బేరు రూరల్: వనపర్తి మండలంలోని కడుకుంట్లలో ఇటీవల సత్యనారాయణ అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ సందర్భంగా సత్యనారాయణ చిత్రపటానికి 2001–02లో జెడ్పీహెచ్‌ఎస్ పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం స్నేహితుని కుటుంబాన్ని పరామర్శించి, అతని భార్య రూ.30 వేల ఆర్థిక సాయం అందించారు. వారి ఇద్దరు కూతుళ్ల పేరు మీద ఒక్కొక్కరికి రూ.50వేల చొప్పున డిపాజిట్ చేసి బాండ్ పేపర్లు అందించారు. తోటి స్నేహితులు చేసిన సహాయానికి గ్రామంలో పలువురు అభినందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థి మిత్రులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల నిరసన



ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

గద్వాల: బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ అరెస్టును ఖండిస్తూ ఆ పార్టీ నాయకులు ఆదివారం జిల్లా కేంద్రంలో ఆందోళన చేపట్టారు. పార్టీ కార్యాలయం నుంచి ప్రభుత్వ దిష్టిబొమ్మతో నిరసన ప్రదర్శన చేపట్టి పాతబస్టాండ్‌లో ధర్నా నిర్వహించారు. సీఎం కేసీఆర్‌కు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి డీకే స్నిగ్ధారెడ్డిలు మాట్లాడుతూ నిర్మల్ మాస్టర్ ప్లాన్ అమలుకు జారీ చేసిన జీఓను రద్దు చేయాలని బీజేపీ నేత మహేశ్వర్‌రెడ్డి చేపట్టిన ఆమరణ నిరాహారదీక్షకు సంఘీభావం తెలుపడానికి వెళ్తున్న డీకే అరుణను పోలీసులు అడ్డుకుని అరెస్టు చేయడం సరికాదన్నారు. ప్రభుత్వం నియంతంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ నాయకుల మెప్పు కోసం పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు. రాబోవు రోజుల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, త్యాగరాజు, జయశ్రీ, నర్సింహ, రాజశేఖర్‌రెడ్డి, కిరణ్, శ్రీనివాస్‌గౌడ్, శ్రీను, మోహన్‌రెడ్డి, రామకృష్ణ పాల్గొన్నారు.

అయిజ: పట్టణంలోని పెద్దవాగుపై చేపట్టిన బ్రిడ్జి నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి కోరారు. ఆదివారం బ్రిడ్జి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిడ్జి నిర్మాణంలో భాగంగా ఏర్పాటు చేస్తున్న పిల్లర్లకు 8 ఎంఎం ఇనుపచువ్వలు ఉపయోగిస్తున్నారని, ఇంటి నిర్మాణాలకు కనీసం 12 ఎంఎం నుంచి 20 ఎంఎం ఇనుపచువ్వలు వాడుతారని తెలిపారు. వందేళ్ల పాటు పటిష్టంగా ఉండాల్సిన బ్రిడ్జిని నాసిరకంగా నిర్మిస్తున్నారని ఆరోపించారు. నాగరాజు, నరసింహయ్యశెట్టి, లక్ష్మణ్‌గౌడ్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి వేడుకలు



మానవపాడులో పూజలు చేస్తున్న భక్తులు



అలంపూర్‌లో..

అలంపూర్: నాగుల చవితి వేడుకలను ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి పుట్టల్లో పాలు పోశారు. నాగదేవతకు నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పట్టణంలోని మాంటిస్సోరి పాఠశాలలో నాగులచవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో ఉన్న పుట్టలో హెచ్‌ఎం నాగలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాలు పోశారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ కేఎస్‌వీ రవిప్రకాష్ పాల్గొన్నారు.

మానవపాడు: మండలంలోని పలు గ్రామాల్లో నాగుల చవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పుట్టల వద్ద పూజలు చేసి పాలు పోశారు.



ఉండవెల్లిలో పాలు పోస్తున్న ముస్లిం వ్యక్తి

ఉండవెల్లి: మండలంలోని గ్రామాల్లో నాగుల చవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని ఓల్డ్‌బ్యాంక్ కాలనీ వద్ద పుట్టలో కులమతాలకు అతీతంగా పాలు పోసి నాగదేవతలకు పూజలు చేశారు.

మద్దతు ధరల గ్యారంటీ చట్టం చేయాలి



మాట్లాడుతున్న వెంకటయ్య

గద్వాల అర్బన్: రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధరల గ్యారంటీ చట్టం చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీనర్ జక్కుల వెంకటయ్య డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. రైతు ఉద్యమకారులపై కేసులను ఎత్తివేయాలని, 2011 సాగుదారుల చట్టాన్ని అమలు చేసి కౌలురైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. పంటలు నష్టపోయిన రైతులందరికీ పరిహారం చెల్లించాలని, సమగ్ర భూసర్వే జరిపి ధరణిలోని లోపాలను సవరించాలని కోరారు. రైతు రుణమాఫీతోపాటు వడ్డీని కూడా మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో తెలంగాణ రైతాంగ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపాల్, జిల్లా అధ్యక్షుడు ఖాజా, ప్రధాన కార్యదర్శి సత్యారెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

కంపు.. కంపు!



అమరచింతలో విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో రహదారి పక్కన చెత్తను వేస్తున్న ఆటో

అమరచింత: పట్టణ శివారులో విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదురుగా ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డ్ వల్ల ప్రధాన రహదారిపై దుర్వాసన వెదజల్లడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి రోజూ పట్టణంలోని చెత్తను తెచ్చి.. తడి, పొడి చెత్తను వేరుచేయకుండా పారబోయడంతో దుర్వాసన దుమ్ములేపుతోంది. డంపింగ్ యార్డ్ సమీపంలో చేనేత ఉత్పత్తిదారుల సంఘం ఉంది. వీటిలో పనిచేసే కార్మికులు జరిచీరలను మగ్గాలపై తయారు చేస్తుంటారు. డంపింగ్ ద్వారా వచ్చే దుర్వాసన భరించలేక ఇక్కడి నుంచి తరలించాలని చేనేత కార్మికులు అప్పటి కలెక్టర్ యాస్మీన్ బాషాకు, మున్సిపల్ కమిషనర్‌కు ఎన్నోసార్లు విన్నవించారు. అయినా ఫలితం లేకుండా పోయింది. దీనిపై మున్సిపల్ కమిషనర్‌ను వివరణ కోరగా, మస్తీపురం శివారులో ప్రభుత్వ స్థలాన్ని డంపింగ్ యార్డ్ కోసం రెవెన్యూ అధికారులు కేటాయించారని, త్వరలోనే వాటిని అక్కడికి తరలిస్తామని తెలిపారు.

గుంతల రోడ్డుతో అవస్థలు



గద్వాల-రాయిచూరు రోడ్డుపై ఏర్పడిన గుంతలు

ధరూరు: మండల కేంద్రంలోని రైస్‌మిల్ సమీపంలో గద్వాల–రాయిచూరు రహదారిపై ఏర్పడిన గుంతలను పూడ్చాలని వాహనదారులు కోరుతున్నారు. గుంతల వద్ద రాకపోకలు సాగించలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుంతల వద్ద ద్విచక్ర వాహనాలను అదుపు చేయలేక ప్రమాదాలకు గురవుతున్నట్లు వాపోతున్నారు. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతు చేయించాలని కోరారు.

రాజీవ్‌గాంధీ ఆశయ సాధనకు కృషి చేద్దాం



ఎర్రవల్లి చౌరస్తాలో..



గద్వాలలో రాజీవ్‌గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు



అయిజలో..

గద్వాల అర్బన్: దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని జెడ్పీ చైర్‌పర్సన్ సరిత, డీసీసీ అధ్యక్షుడు పటేల్ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాజీవ్‌గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో అత్యాధునిక టెక్నాలజీ రంగాన్ని తీసుకొచ్చిన ఘనత రాజీవ్‌గాంధీకే దక్కిందన్నారు. కార్యక్రమంలో శంకర్, నారాయణరెడ్డి, వీరుబాబు, నల్లారెడ్డి, గౌస్, ఇసాక్, కిఫాయత్, జహంగీర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎర్రవల్లిచౌరస్తా: కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రుక్మాందర్‌రెడ్డి ఆధ్వర్యంలో రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలను ఎర్రవల్లి చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి కార్యకర్తలకు మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అలంపూర్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జోగుల రవి, వెంకటేష్, అబ్దుల్ బార్, వెంకటన్న, రవి, అంజి, కిరణ్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, రవియాదవ్ పాల్గొన్నారు.

అయిజ: పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాజీవ్‌గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో టీపీసీసీ అధికార ప్రతినిధి షేక్షావలి ఆచారి, డీసీసీ ఉపాధ్యక్షుడు దేవరాజు, నాయకులు మనుమన్న, మైనర్‌బాబు, మధుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కేటీదొడ్డి: రాజీవ్‌గాంధీ ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని ఎంపీటీసీ గీత కోరారు. మండలంలోని నందిన్నెలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు విశ్వనాథ్‌రెడ్డి, అక్బర్‌అలీ, కొండారెడ్డి, పాండు, వీరేష్‌నాయక్ పాల్గొన్నారు.

ఉండవెల్లి: మండల కేంద్రంలో రాజీవ్‌గాంధీ జయంతిని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాగరాజు, సర్పంచ్ నాగేష్, ఉపసర్పంచ్ రామచంద్రారెడ్డి, నర్సన్‌గౌడు, రమేష్, నయీం, చంద్రన్న, బాల్‌రాజు, మద్దిలేటి, పాండు పాల్గొన్నారు.